ప్రజాశక్తి

ఆదివారం 4 ఆగస్టు 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

రెండున్నరేళ్లలో మహానాడు రైల్వే ఫ్లైఓవర్ పూర్తి

- ఎంపి కేశినేని శివనాథ్ వెల్లడి
- రూ.800 కోట్లతో నిర్మాణం
- తూర్పు బైపాస్‌కు కేంద్రం రూ.2,500 కోట్లు కేటాయింపు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)

ప్రజాశక్తి - విజయవాడ : రెండున్నరేళ్లలో మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు రైల్వే బ్రిడ్జ్ ఫై ఓవర్ నిర్మాణం పూర్తి చేస్తామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. దీనికి కేంద్ర జాతీయ రహదారి మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపిందన్నారు. రెండు నెలల్లో టెండర్లు పిలుస్తామని, ఇప్పటికే డిపిఆర్ సిద్ధమైందన్నారు. ఫై ఓవర్ రూ.800 కోట్లు, తూర్పు బైపాస్ కి 2,500 కోట్లను కేంద్రం కేటాయించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి ఫలితం మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు రైల్వే బ్రిడ్జ్ వరకు ఆరులైన్ల ఫ్లైఓవర్‌కు, విజయవాడ తూర్పు బైపాస్‌కు కేంద్ర రోడ్లు జాతీయ రహదారి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినట్లు ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నెలరోజుల్లో ఇక్కడ వున్న అన్ని డిపార్ట్మెంట్లవాసులతో కలిసి ఫ్లై ఓవర్ ఏ విధంగా వుండాలనేది నేషనల్ హైవే అధికారులు నిర్ణయించనున్నారు. ఇప్పటికే ఈ ఫ్లైఓవర్‌కు డిపిఆర్ సిద్ధమైందన్నారు. అయితే మరోసారి రివైజ్డ్ డిపిఆర్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. దీనిని నెలరోజుల్లోను సమర్పిస్తారని చెప్పారు. రెండు నెలల్లో టెండర్‌ను పిలుస్తామని తెలిపారు. ఫిబవరి, మార్చి నెలల్లో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. రెండున్నరేళ్లలో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఈ నిర్మాణం జరిగేలోపు రామవరప్పాడు నుంచి గన్నవరం వెళ్లేందుకు రెడియల్ రోడ్లు కూడా నిర్మించనున్నట్లు తెలిపారు. ఫ్లైఓవర్‌కు దాదాపు రూ.800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తూర్పు బైపాస్‌కు సంబంధించి నిధులు మంజూరు మరో రెండు నెలల్లో జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి ఎలైన్మెంట్ పనులు మరోసారి చెక్ చేస్తున్నారని తెలిపారు. ఈ తూర్పు బైపాస్ పనులు కూడా మార్చిలోపు ప్రారంభం అయ్యేవిధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. మూడున్నరేళ్లలో తూర్పు బైపాస్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. తూర్పు బైపాస్ రూ.2,500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ కింద విజయవాడ రైల్వేస్టేషన్‌ను ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా రాబోయే 50 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ కేంద్రం సిద్ధం చేస్తోందన్నారు.

దీనస్థితిలో ముడా

- ఆదాయం మూరెడు...ఖర్చు బారెడు
- ల్యాండ్ పర్చేజింగ్ స్కీం అప్పు రూ.200 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్రాభవం కోల్పోతోంది. ప్రతి ఏటా అయ్యే కనీస నిర్వహణ ఖర్చులను కూడా రాబట్టుకోలేని దుస్థితిలో ఉంది. మరోపక్క పోర్టు అవసరాలకు ల్యాండ్ పర్చేజింగ్ స్కీంకు భారీగా తీసుకొచ్చిన అప్పు వెన్నాడుతోంది.

తమ పరిధిలో స్వయం సమృద్ధి, అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి ప్రభుత్వం పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే బందరు పోర్టు నిర్మాణ అవసరాలకు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి 2016లో ముడాను అప్పటి టిడిపి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా కేంద్రం మచిలీపట్నం నగరపాలక సంస్థ, రూరల్ గ్రామాలతోపాటు పెడన మున్సిపాల్టీలతో తొలుత 426.16 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ముడాను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ విస్తీర్ణాన్ని 2076.76 చదరపు కిలోమీటర్లకు పెంచింది. ఈ పరిధిలో నిబంధనలకు అనుగుణంగా రియల్ వెంచర్ల లే అవుట్లు, భవన నిర్మాణ అనుమతులకు నిర్దేశించిన ఫీజులు వసూలు చేయడం ద్వారా ముడా ఆదాయాన్ని సమకూర్చుకోవాల్సి ఉంది. ఫీజుల ద్వారా ఏడాదికి ముడాకు కోటి రూపాయలు సమకూరుతుండగా, అధికారులు, సిబ్బంది వేతనాలు, కార్యాలయ భవనానికి అద్దెకు ఏడాదికి రూ.1.50 కోట్లు ఖర్చవుతోంది. అధికార యంత్రాంగం ఉదాసీనతతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. పోర్టు నిర్మాణం, ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారుల విస్తరణ పూర్తవుతుండడంతో ముడా పరిధిలో లే అవుట్లు, అపార్టుమెంట్ల నిర్మాణం పెరిగింది. అనధికార లే అవుట్లు, అపార్టుమెంట్ల నిర్మాణం పట్ల అధికారులు ఉదాసీనంగా ఉండటంతో దాని నిర్వహణ కూడా ఆదాయాన్ని సమకూర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి.

అద్దె భవనంలోనే!

ముడాను ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లయినా దానికి

కార్యాలయ భవనాన్ని సమకూర్చుకోలేదు. అద్దె భవనంలోనే కొనసాగాల్సి వస్తోంది. నెలకు రూ.30 వేలకుపైగా అద్దెకు చేస్తున్నారు.

ముడా నెత్తిన రూ.200 కోట్ల అప్పు

ల్యాండ్ పర్చేజింగ్ స్కీం ద్వారా పోర్టు నిర్మాణ అవసరాల భూ సేకరణలో మినరల్ డెలవప్‌మెంట్ కార్పొరేషన్ రూ.200 కోట్లు రుణంగా సమకూర్చింది. ఈ నిధులతో పోర్టు అవసరాలకు 600 ఎకరాల భూములను ముడా కొనుగోలు చేసింది. కొంత ముడా నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంది. ఎన్నికల నాటికి రూ.20 కోట్లు ముడా ఖాతాలో మిగిలింది. మిగిలిన నిధులను గత ప్రభుత్వం దాని పరిధిలో పలు అభివృద్ధి పనులకు కేటాయించింది. దీంతో దాని ఖాతా ఖాళీ అయ్యింది.

ఆదాయాన్ని పెంచడానికి చర్యలు

ఎం.వెంకట రమణ, ముడా విసి

ముడా ఆదాయాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రస్థాయిలో భవన నిర్మాణాలు, లే అవుట్ల పరిశీలనకు కార్పొరేషన్ నుంచి నలుగురు ప్లానింగ్ అసిస్టెంట్లను తీసుకుంటున్నాం. పోర్టు అవసరాలకు సేకరించిన భూముల్లో 15 ఎకరాల్లో మామిడి, జీడి మామిడి తోటలు, మరో 10 ఎకరాల్లో ఆక్వా చెరువులు ఉన్నాయి. వీటిని వేలం వేయడం ద్వారా మరికొంత ఆదాయం సమకూరుతుంది. త్వరలోనే వేలం నిర్వహిస్తాం.

విజయవాడ బీసెంట్ రోడ్డులో జరిగిన విరాళాల సేకరణలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్

వయనాడ్ విపత్తు బాధితులకు సిపిఎం అండ

పలుచోట్ల విరాళాల సేకరణ

వార్తలు లోపలి పేజీల్లో



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విద్యార్థులు విద్య నేర్చుకోవడంతోపాటు సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. శనివారం నగరంలోని సుజనా వెన్యూలో జరిగిన రేజోనేన్స్ విద్యార్థుల రెజో పరిచయ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ విద్యార్థులు సమాజం, కుటుంబ సభ్యులు, తోటి వారి పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. విద్య కేవలం పుస్తకాలతో మాత్రమే నేర్చుకునేది కాదన్నారు. సమాజం పట్ల అవగాహన కలిగి ఉండడం ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మరో అతిథి వి.పి.సిద్ధార్థ ప్రిన్సిపాల్ సీతారామయ్య మాట్లాడుతూ సాంకేతిక విద్య అనేక విధాలుగా విస్తృతి చెందిందన్నారు. విద్యార్థులు తమకు ఏ అంశం పట్ల ఆసక్తి ఉందో అదే అంశాన్ని ఎంచుకొని చదవడం ద్వారా రాణించగలుగుతారని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక రోల్ మోడల్‌ను ఎంచుకోవాలని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలకు అందుకోగలుగుతారని అన్నారు తొలుత రిజోనెన్స్ డైరెక్టర్ బండ్ల మాధవరావు అతిథులను సభకు పరిచయం చేశారు. సీఈవో గౌతం సాయి, చైర్మన్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, అకాడమిక్ డీన్ వి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ రాయుడు, విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిందు సేద్యానికి రాయితీలు

ఎపిఎంఐపి పథక సంచాలకులు సుభాని

ప్రజాశక్తి - విజయవాడ : బిందు సేద్యానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపి పథక సంచాలకులు పీ.ఎం సుభాని ఒక ప్రకటనలో కోరారు. 2024-25 సంవత్సరానికి ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్, సింక్లర్లకు ఆరువేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇందుకు రూ.19.82 కోట్ల రాయితీని అందిస్తున్నట్లు తెలిపారు. మెట్ట, మాగాణి ఏదైనా 5 ఎకరాలలోపు 90 శాతం రాయితీ (రూ.2.18 లక్షల వరకు), 5 నుండి 12.50 ఎకరాలలోపు 50 శాతం రాయితీ (రూ.3.10 లక్షల వరకు) ఇస్తామని తెలిపారు. డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు పొందగోరు రైతులు ఆధార్ కార్డ్, 1బి పత్రం, ఎఫ్ఎంబి, బ్యాంక్ పాస్ బుక్ తీసుకొని సమీప రైతు సేవా కేంద్రం / ఉద్యానాధికారి / పథక సంచాలకుల కార్యాలయంలో సంప్రదించి నచ్చిన కంపెనీని ఎన్నుకొని బయోమెట్రిక్ నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు పథక సంచాలకులు ఏపీఎంఐపీ, ఎన్టిఆర్ జిల్లావారిని 0866- 3500193, 79950 09910, 79950 09911 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉద్యాన పంటల రాయితీ రూ.3.23 కోట్లు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో 2,387 మంది రైతులకు రూ.3.23 కోట్ల మేర వివిధ ఉద్యాన పథకాల (2023-34)కు సంబంధించి మొదటి విడతగా రూ.3.23 కోట్లు ప్రభుత్వ రాయితీ విడుదలైందని జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆమోదంతో రైతుల ఖాతాల్లో ఈ రాయితీ మొత్తాన్ని నేరుగా జమచేస్తామని తెలిపారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద 267 మంది రైతులకు రూ.0.965

(మిగతా 2లో)

ఎంపి బాలశౌరికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

ఇపిఎస్ పెన్షనర్ల సమస్యలపై ఎంపి బాలశౌరికి వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : ఇపిఎస్-95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎపిఆర్‌పిఎ ఆధ్వర్యాన మచిలీపట్నం ఎంపి వల్లభనేని బాలశౌరికి వినతిపత్రం అందించారు. ఎపిఆర్‌పిఎ రాష్ట్ర, కష్ణా జిల్లా నాయకులు ఎన్.ఎ.శాస్త్రి, పి.శ్రీనివాసరావు, వి.రాజేశ్వరరావు, ఏ.పున్నారావు, ఆలపాటి మోహన్‌రావు, బిడిఆర్ రెడ్డి, కె.కోటేశ్వరరావు తదితరులు ఎంపిని కలిసి పెన్షనర్ల ముఖ్య సమస్యలను వివరించారు. డిఎతో కలిపి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. దీనిని పరిశీలించిన ఎంపి... పార్లమెంట్ సమావేశాల జీరో అవర్లో ప్రశ్న రూపంలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. ఎంపి కార్యాలయం నుండి సంబంధిత కేంద్ర మంత్రికి లేఖ పంపాలని నేతలు కోరారు.

'ఠాగూర్'కు ఏసీ బహూకరణ

ప్రజాశక్తి - విజయవాడ : కాకాని వెంకటరత్నం 124వ జయంతి సందర్భంగా ఆయన మనవడు కాకాని తరుణ్ శనివారం గవర్నర్‌పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయానికి ఏసీని బహూకరించారు. తన తాతను స్మరించుకుంటూ గ్రంథాలయానికి సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ ప్రెసిడెంట్, జడ్జి నేలపూడి చిరంజీవి, ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమిషన్ మెంబర్, జడ్జి, అక్కి పెద్ది వెంకటరమణ, స్థానిక బీజేవైఎం నాయకులు నవీన్, భాను, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు వినీత

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు బూసి వినీత శనివారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజనను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ జి ఉమాదేవి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రాయితీ రూ.3.23 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు, జాతీయ వంట నూనెల మిషన్-ఆయిల్‌పాం కింద 661 మంది రైతులకు రూ.1.614 కోట్లు, ఉద్యాన పంటల సమగ్రాభివద్ధి పథకం కింద 1,459 మంది రైతులకు రూ.0.649 కోట్ల రాయితీ విడుదలైనట్లు తెలిపారు. 2023-24కు సంబంధించి రెండో విడత నిధులు, 2022-23, 2021-22, 2020-21 సంవత్సరాలకు సంబంధించిన రాయితీ నిధులు కూడా త్వరలో విడుదలకానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 2024-25కు సంబంధించి వివిధ ఉద్యాన పథకాల పరిధిలో రాయితీ పొందేందుకు రైతులు ముందుకు రావాలని ఆయన సూచించారు. పథకాల వివరాలకు ఉద్యాన రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ/ఉద్యాన సహాయకులను సంప్రదించాలని బాలాజీ కుమార్ సూచించారు.

ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సర్వీసు పొడిగింపు

ప్రజాశక్తి - విజయవాడ : గిరిజన ఆశ్రమ పాఠశాలల ద్వారా గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధనను అందించి రానున్న విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలను సాధించేలా కృషి చేయాలని ఎ కొండూరు గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. ఎ.కొండూరు పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శనివారం కలెక్టర్ సృజన, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జె.సునీతతో కలిసి పునరుద్ధరణ నియామకపు పత్రాలను కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అత్యుత్తమ బోధనను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా విద్యా శాఖ అధికారి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు సభ్యులుగా ఏర్పాటైన కమిటీ ఉపాధ్యాయుల పని తీరును క్షుణ్ణంగా పరిశీలించి ప్రతిభగల ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఎ.కొండూరు గిరిజన ఆశ్రయ పాఠశాలలో మరోఏడాది పాటు పనిచేసేలా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారి సర్వీసును పొడిగిస్తూ మంజూరు పత్రాలను కలెక్టర్ అందజేశారు.

క్వారీ మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

మంత్రి కొల్లు రవీంద్రకు సిపిఐ నేతల వినతి

ప్రజాశక్తి -విజయవాడ : పరిటాల క్వారీ మతులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రమాదానికి కారణమైన పవన్ గ్రాన్కెట్స్ మెటల్ వర్క్సును సీజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు సిపిఐ ప్రతినిధి బందం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ మైనింగ్ మాఫియా రాజ్యమేలుతోందని, హెక్టరుకు హెక్టార్లు అక్రమ క్వారీలు, త్రవ్వకాలు, పేలుళ్ళ జరుగుతున్నా, కార్మికులకు భద్రతా చర్యలు తీసుకోకుండా మైనింగ్‌శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని తెలిపారు. లేబర్ డిపార్ట్మెంట్ కాంపెన్సేషన్ యాక్ట్ కింద నష్టపరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినా కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి రూ.50 లక్షల మేర నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ లీజు క్వారీల వాద్దలను ఏర్పాటు చేస్తామని, అధికారులతో చర్చించి ప్రభుత్వం వైపు నుంచి క్వారీ మతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇప్పించడానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రతినిధి బందంలో సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరిచూరి రాజేంద్ర బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, లంకా గోవిందరాజులు, జిల్లా సమితి సభ్యులు తాడి పైడియ్య, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య ఉన్నారు.

IN THE COURT OF THE MACT CUM Ist ADDL DIST JUDGE AT SURYAPET
O.P. NO: 82 OF 2023
Beetween:-
రావుల శంకరయ్య .....**పిటీషనరు**
మరియు
గంజి నరేంద్ర మరియు ఇతరులు .....**రెస్పాండెంట్స్**
టు,R1
గంజి నరేంద్ర S/o: వెంకటరెడ్డి H.No: 76-17-18/1 వివేకానంద కాలనీ, పోలేరమ్మ గుడి దగ్గర, ఊర్మిళనగర్, విజయవాడ అర్బన్ NTR జిల్లా.
పైన తెలిపిన పిటీషనరు పై గౌరవనీయ కోర్టులో సెక్షన్ 166 యం.వి యాక్టు1988 మరియు రూల్స్ 455 ఆంధ్రప్రదేశ్ యం.వి యాక్టు రూల్స్ 1989 ప్రకారం ప్రమాద నష్ట పరిహారం గురించి కేసు వేయడమైనది. పై కేసులో మీలోని 1వ వారికి కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా పంపిన నోటీసు ముట్టక తిరిగి వచ్చినది. పై కేసు మీ హాజరు నిమిత్తం ది.05-08-2024న కలదు. కావున మీరు ఆరోజున పై కోర్టుయందు స్వయముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని ఉ॥ 10:30 గం॥లకు హాజరు కాగలరు. లేనిచో పై కేసు మీ పరోక్షమున తీర్పుచెప్పబడును.
//కోర్టు వారి అనుమతితో//
GONDRALA ASHOK,M.A.,LLB
ADVOCATE., SURYAPET
Cell: 9490569341

నేడు జక్కంపూడిలో రెండు ఉచిత మెగా వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : నగర సమీపంలోని జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలోని విజేత ఇంగ్లీషు మీడియంలో స్కూల్‌లో ఆదివారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు అయాన్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యాన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం, అలాగే ఫ్యామిలీ ఆస్పత్రి ఆధ్వర్యాన పలు ఆరోగ్య సమస్యలపై మరో అతిపెద్ద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్స్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య శిబిరంలో బిఆర్పి రోడ్ ఇస్లాంపేటలోనిఅయాన్ 'ఐ' హాస్పిటల్ ఛీఫ్ డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా మందులు, 'ఐ' డ్రాప్స్ ఇస్తారని, శస్త్ర చికిత్సలు, కళ్ళజోళ్ళు అవసరమైన రోగులకు రాయితీలు కల్పిస్తారని తెలిపారు. అలాగే అజిత్‌సింగ్ నగర్ కష్ణా హోటల్ సెంటర్లోని ఫ్యామిలీ హాస్పిటల్ చీఫ్, ప్రముఖ డయాబెటాలజిస్ట్, ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను బిపి, షుగర్, థైరాయిడ్, కిడ్నీలో రాళ్ళ తదితరాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. అవసరమైన వారికి హెచ్‌బి, డబ్ల్యుబిసి, ప్లేట్లెట్స్ వంటి అతి ముఖ్యమైన 18 రకాల రక్త పరీక్షలు కూడా డాక్టర్ సూచనపై ఉచితంగానే నిర్వహిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెజవాడ రాజారావు హైస్కూల్లో ఎన్‌సిసి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : విద్యార్థి దశలో క్రమశిక్షణకు, ఐక్యతకు మారుపేరుగా ఎన్‌సిసి ట్రెనింగ్ నిలుస్తుందని 17వ ఆంధ్ర ఎన్‌సిసి బెటాలియన్ సుబేదార్ మేజర్ ఎస్.వి. రమణ తెలిపారు. తమ బెటాలియన్ ఆధ్వర్యంలో 38 పాఠశాలలు, తొమ్మిది కళాశాలల్లో ఎన్‌సిసి యూనిట్లు ఉన్నాయని అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్లో జూనియర్ డివిజన్ బాలురు, బాలికల ఎన్‌సిసి యూనిట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాడేట్ నియామకానికి రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్నెస్ పూర్తిచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి శ్యాంప్రకాష్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, ఎన్‌సిసి కేర్ టేకర్ సందీప్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన
నాగాయలంక మండలం, తలగడదివి గ్రామానికి చెందిన గుండాబత్తిని లక్ష్మి వెంకటరమణ భర్త: వెంకట సుబ్రహ్మణ్యం అనే నేను ముమ్మారెడ్డి వెంకట సుబ్రహ్మణ్యంతో వివాహం తరువాత తనపేరు ముమ్మారెడ్డి ధనలక్ష్మిగా పేరు మారింది. నా ఆధార్ కార్డులో కూడా ముమ్మారెడ్డి ధనలక్ష్మిగానే నమోదు అయ్యింది. కావున లక్ష్మి వెంకటరమణ అయినా ముమ్మారెడ్డి ధనలక్ష్మి అయినా నా పేరే అని యావత్ ప్రజలకు తెలియపరుస్తున్నాను. ఇకపై నన్ను ధనలక్ష్మిగానే పిలవాలని తెలియపరుస్తున్నాను.
ఇట్లు
ఎం.డి. ధనలక్ష్మి, భర్త : వెంకట సుబ్రహ్మణ్యం, తలగడదివి, నాగాయలంక మండలం, కృష్ణాజిల్లా.

సకాలంలో నిత్యావసరాలను పంపిణీ : జెసి

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : ఎండియు ఆపరేటర్లు కార్డుదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు అందించేలా అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆమె శనివారం విజయవాడ సింగ్‌నగర్ వద్ద మొబైల్ డిస్పెన్సింగ్ వెహికల్ (ఎండియు) ద్వారా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ యం.మోహన్ బాబు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనులకు సొంతింటి కల నేరవేరింది : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : గిరిజన లబ్దిదారులకు ఇళ్ళ కేటాయింపులో చెల్లించాల్సిన వాటాను ప్రభుత్వమే చెల్లించి సొంతింటి కలను నేరవేర్చిందని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. జెఎన్‌ఎన్‌యుఆర్‌యం పథకం కింద ఇంటిని కేచాయించేందుకు లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటా కింద గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని శనివారం కలెక్టర్ సృజన, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి జె.సునీత కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో లబ్దిదారులకు చెక్కుల రూపంలో అందించారు.

మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపునకు ఉద్యమం : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రంలోని సంక్షేమ వసతి గహ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుతున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) జిల్లా అధ్యక్షులు ఐ.రాజేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరణ క్రీస్తురాజపురంలోని రామనర్సయ్య భవన్‌లో శనివారం పిడిఎస్‌యు నాయకులు ఆవిష్కరించారు. పెరిగిన ధరలనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలన్నారు. ఈకార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు ఎల్.శివ, గణేష్, కె.సాయి, మనోజ్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఘనంగా ఎంపి కేశినేని శివనాథ్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం పలు ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. రాఘవయ్యపార్క్ సమీపంలోని నిర్మల హదయ భవన్‌లో టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపి సతీమణి కేశినేని జానకి లక్ష్మీ, కుమారుడు కేశినేని వెంకట్ పాల్గొని కేక్ కట్ చేశారు.

హారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
ఓఎస్ నెం. 242/2023
బిట్వీన్:
వెదురు జ్యోతిలక్ష్మి ...... వాది
మరియు
ముక్కెర నాగిరెడ్డి మరియు ఇతరులు ... ప్రతివాదులు
టు:
(5వ ప్రతివాది)
ఓబులరెడ్డి వెంకటరమణ వైఫ్ ఆఫ్ వెంకటేశ్వరరెడ్డి R/o వెల్లంకి గ్రామం, వీరులపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఏపీ
పై నెంబరు దావా నెం. 242/2023 లో 5వ ప్రతివాది అయిన మీకు సమన్లు నిమిత్తం ది. 10-09-2024 వ తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ది.10-09-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు స్వయ ముగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై తెలిపిన కోర్టు వారి యెదుట హాజరు కావలసినదిగా తెలియచేయట మైనది.
శ్రీ కోర్టువారి ఉత్వరుల ప్రకారం
వాయిదా తేదీ: 10-09-2024
ఇట్లు
చింతల వెంకటరెడ్డి
అడ్వకేట్, తిరువూరు
తిరువూరు. **సెల్. 94407 64148**

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి : సిఐటియు

కార్మికులతో మాట్లాడుతున్న సోమేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం: గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామపంచాయితీ కార్మికులతో ఎ.పి.గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి సిఐటియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు యం.సోమేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ రామవరప్పాడు గ్రామ పంచాయితీలో స్వీపర్స్, డ్రైనేజి క్లీనర్స్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిషియన్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరు గ్రామాల్లోని ప్రజలకు పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం రక్షణలో విశేషమైన సేవలందిస్తున్నారు. ధరలు రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం వస్తున్న వేతనాలు చాలక కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500-ల వేతనంతో జీవనం గడవటం కష్టంగా ఉందన్నారు. వివిధ విభాగాలలో పనిచేసే కార్మికులకు వేతనాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్న వేతనాల కమిటీ నిర్ణయిస్తుందని తెలిపారు. దాని ప్రకారం రోజుకు అన్స్కిల్డ్ వర్కర్స్కు రూ.569లు, సెమిస్కిల్డ్ వర్కర్స్కు రూ.683లు, స్కిల్డ్ వర్కరు రూ.797లు చొప్పున చెల్లించాలని ఆదేశించటమైనదన్నారు. రామవరప్పాడు గ్రామపంచాయితీలోని కార్మికులకు కలెక్టర్ ఆధ్వర్యంలోని వేతనాల కమిటీ నిర్ణయించిన దానికి తగ్గకుండా వేతనాలు నిర్ణయించి చెల్లించవలసిందిగా డిమాండ్ చేశారు. సిఐటియు విజయవాడ రూరల్ మండలం కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారినా కార్మికులను మార్చకూడదని, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులనే కొనసాగించాలని, ఎవరినీ తొలగించరాదని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

గౌరవాధ్యక్షులుగా పి.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా సీతారామరాజు, కార్యదర్శిగా వీరమ్మ, కమిటీ సభ్యులుగా రాధ, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. వేతనాల పెంపుదల, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించాలని పరిష్కారం కాని పక్షంలో అవసరమైతే సమ్మెతో సహా ఆందోళనలకు సిద్ధం కావాలని నిర్ణయించారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తొలగించాలి

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: ఆరుకాలం కష్టించి పంట పండించిన రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడంలో గత ప్రభుత్వ విధానాల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుత ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులకు మేలు చేసే విధానాలు అవలంభించాలని తోట్లవల్లూరు టిడిపి సీనియర్ నాయకులు గుత్తా రామకృష్ణ శనివారం తెలిపారు. మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో రైతులు ధాన్యాన్ని పండిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్బికే కేంద్రాల ద్వారా మిల్లర్లకు రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని పంపించారని, మిల్లర్లు చెప్పిన దరకే రైతు ధాన్యాన్ని అమ్మాల్సిన దీనస్థితి ఏర్పడిందని దీనివల్ల అనేక మంది రైతులు నష్టాలు సరి చూశారని అన్నారు ప్రస్తుత ప్రభుత్వంలో పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రైతుల పట్ల జాలి చూపించి,పాత విధానాలను రద్దుచేసి రైతు నేరుగా మిల్లర్లకే తమ దాన్యాన్ని అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లేలా కృషి చేసి రైతులకు మేలు చేయాలని ఆయన కోరారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పేదలకు పక్కా ఇంటి కల సాకారం చేసి తీరాల్సిందేనని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధికారుల్ని ఆదేశించారు. మచిలీపట్నంలోని తన నివాసంలో మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాల పేరుతో డ్రామాలు తప్ప ఎక్కడా, ఎవరికీ న్యాయం చేసింది లేదన్నారు. సెంటు పట్టాల పేరుతో భారీ స్కాములకు తెరలేపారన్నారు. అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు ఇచ్చి అవే గొప్ప అన్నట్లుగా వ్యవహరించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇంటి పట్టాల మంజూరుకు సిద్ధమయ్యాం అని త్వరలోనే అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేస్తామన్నారు. హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు .నాడు ఎన్టీఆర్ పక్కా ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారని. ఇప్పుడు మళ్లీ ఇళ్ల పండుగ ప్రారంభం కాబోతోందన్నారు. ఇళ్ల పట్టాల కేటాయింపులో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

ప్రాచీన కళల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ప్రాచీన కళలను సమాజం లోని అందరికీ పరిచయం చేసి అవి అంతరించి పోకుండా చూడాల్సిన భాధ్యత అందరి పైనా ఉందని పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యా లయ ప్రిన్సిపాల్ మహ్మద్ అసీఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. స్థానిక పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయలో రూట్స్ 2 రూట్స్‌లో భాగంగా భారత్ లోని అద్భుత కళ ల్లో ఒకటైన కథక్ వర్క్షాప్ (కార్యశాల) శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ కథక్ నత్యకారుడు అఖిలేష్ కుమార్ పాటిల్ అత్యంత అద్భుతంగా తన కథక్ నత్యాన్ని ప్రదర్శించారు. దేశం గర్వించదగ్గ కళల్లో కథక్ ఒకటి అన్నారు ఇలాంటి కళని 185వ కేవీ లో శనివారం ప్రదర్శన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమం లో తబలా వాయిద్య కారుడు తివారి, మోహిత్ కుమార్ పాల్గొన్నారు.

గన్నవరం మండల పరిషత్‌లో

అవినీతి, అక్రమాలపై సభ్యుల ఆగ్రహం

మాట్లాడుతున్న ఇన్చార్జి ఎంపిపి కొమ్మరాజు సుధీర్

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండల పరిషత్‌లో గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని, ఎంపీటీసీ లతో సంబంధం లేకుండా వైసిపి ఎంపీపీ ఏకపక్షంగా వ్యవహరించి ప్రజాధనం స్వాహా చేశారని, పర్సంటేజీల పాలన సాగించారని ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం గన్నవరం మండల పరిషత్తు కార్యాలయం మీటింగ్ హాలులో ఇన్చార్జి ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. 23 మంది ఎంపీటీసీలకు గాను 19 మంది హాజరయ్యారు. అన్ని శాఖల నుంచి అధికారులు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు మాట్లాడుతూ.. గత మూడేళ్ల వైసిపి పాలనలో ఎంపీటీసీ సభ్యులకు ఏ విధమైన ప్రాధాన్యత లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గోపవరపు గూడెంలోని స్లేట్ స్కూలుకు మండల పరిషత్ నిధులు 10 లక్షలతో రోడ్డు వేశారని, మండలం నుంచి బిల్లు చెల్లించారని చెప్పారు. అయితే ఆ స్కూలు యాజమాన్యం నుంచి ఎంపీపీ రవి పది లక్షల రూపాయలు ప్రైవేట్ గా తీసుకొని జేబులో వేసుకున్నాడని ఆరోపించారు. గ్రామాల్లో వర్కులకు పర్సంటేజీలు తీసుకుని శాంక్షన్లు ఇచ్చారని విమర్శించారు. వర్కుల శాంక్షన్ విషయంలోనూ ఎంపీటీసీల ప్రమేయం లేదని, అంతా ఏకపక్షంగానే చేశారని, నిజం చెప్పాలంటే ఎంపీటీసీలను మోసం చేశారని ధ్వజమెత్తారు. చేసిన పనులకు సక్రమంగా బిల్లులు ఇవ్వకుండా, సొంత వాళ్లకు ముందుగా బిల్లులు ఇచ్చుకుని పర్సంటేజీలు లాగేసారని చెప్పారు. మండల పరిషత్తులో వైసీపీ పాలన ప్రహరీ గోడ కూల్చివేతతో మొదలైందని, షాపింగ్ కాంప్లెక్స్ కడతామంటూ చెప్పి చివరకు గోడ లేకుండా చేశారని పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారులు దృష్టికి తెచ్చారు. ఇంత జరుగుతున్న అధికారుల మీనమేషాలు లెక్కించడంపై ఆగ్రహించారు. గన్నవరం పంచాయతీలో వర్కులకు 10 శాతం కమిషన్ వస్తువులు చేసిన పరిస్థితి ఉందన్నారు. ఇన్చార్జి ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ మాట్లాడుతూ.. ఇకపై ఇలాంటి పాలన ఉండదని, ఎంపీటీసీలు లెటర్ ఉంటేనే వర్కుల శాంక్షన్ ఉంటుందని తెలిపారు. బిల్లులు కూడా ప్రాధాన్యత క్రమంలో చెల్లిస్తామన్నారు. కార్యాలయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఐదు లక్షలు శాంక్షన్ చేస్తూ తీర్మానం చేస్తున్నట్లుగా చెప్పారు. మూడేళ్ల పాటు అంతా అక్రమమైన పద్ధతిలో పాలన సాగిందని, ఈ విధానం వల్ల ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు మోసపోయిన పరిస్థితి ఉందన్నారు. ప్రతి పనికి ఓ రేటు పెట్టుకుని వసూలు చేసిన ఘన చరిత్ర గత మూడేళ్లలో కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనుంచి అధికారులు తమ పనితీరును మార్చుకోవాలన్నారు. ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. అనంతరం పాత వర్కులను రద్దు చేస్తున్నట్లు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్య కుమార్, వైస్ ఎంపీపీ 1 సాతులూరి శివ నాగరాజకుమారి పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడిపంటలే పునాది

ప్రజాశక్తి-అవనిగడ్డ: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పాడిపంటలే పునాది అని నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ తెలిపారు. శనివారం పంచాయతీ పరిధిలోని కొత్తపేట రామకోటి పురం గ్రామాల్లో ఏపీఎల్డిఏ గన్నవరం వారి ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకట్ రామ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పాడిపంటలతో ఏ ప్రాంతం అయితే విరాజిల్లుతుందో ఆ గ్రామం అన్ని రంగాలలో ముందుకు సాగుతుందని తెలిపారు అభివద్ధికి పునాది గ్రామీణ వ్యవస్థలో పాడిపంటలే అన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు రైతులు తమ పాడి పశువులను తీసుకువచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఎంపీటీసీ బొప్పన భాను పాల్గొన్నారు.

ఇంటర్ అర్హతతో ఉద్యోగావకాశాలు : విక్టర్‌బాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ చొరవ తో ఉద్యోగులుగా మారనున్నా మహత్తర అవకాశం లభిస్తుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటన లో తెలియజేశారు. జిల్లాలో 2022-23,2023-24 విద్య సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారు మరియు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు అని ఆయన పేర్కొన్నారు.వీరికి జిల్లా ఉపాధి కల్పన శాఖ మరియు నైపుణ్యాభివద్ధి శాఖ సంయుక్తంగా హెచ్.సి.ఎల్ - టెక్ బి వారి సహకారంతో గన్నవరం నియోజకవర్గం పరిధిలోని కేసరపల్లి లో హెచ్‌సిఎల్ ఆఫీస్ ఆవరణలో ఈ నెల 6వ తేదీ అనగా మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు విక్టర్ బాబు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఇంటర్ విద్యార్థులు ఈ జాబ్ మేళా లో పాల్గొనేందుకు ముందుగా https://bit.ly/TechbeeGoAP ఈ లింక్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియా పూర్తి చేసుకోవాలని అనంతరం జాబ్ మేళా లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.తొలత క్యాట్ పరీక్ష , ఇంటర్వ్యూ చివరిగా ఇంగ్లీష్ స్కిల్ పరీక్ష నిర్వహించి ఎంపిక పూర్తి చేస్తారు.ఎంపికైన అభ్యర్థులకు సంవత్సర కాలం పాటు శిక్షణ ఇస్తారని ఆ కాలంలో 7వ నెల నుండి నెల కు 10 వేల రూపాయలు స్టైఫండ్ ఇస్తారని విక్టర్ బాబు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ బైపైసీ, సిఈసి,హెచ్ఇసి ఇతర ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోపిదేవి ఆలయంలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి-మోపిదేవి: గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ జస్టిస్ వి. శ్రీనివాస్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ సూపరింటెండంట్ బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

రత్నమణికి నివాళి

ప్రజాశక్తి-పెదపారుపూడి

వానపాముల గ్రామానికి చెందిన సిపిఎం సభ్యులు పాతూరి మోషే సతీమణి రత్నమణి (75) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. రత్నమణి మృతదేహాన్ని పామర్రు సిపిఎం నాయకులు ఓ.గంగాధర్ ప్రసాద్, గుడివాడ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, సీనియర్ నాయకులు మురళీకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రమేష్, కౌలు రైతు సంఘం నాయకులు దాసు సందర్శించి నివాళులర్పించారు.

నేడు ప్రజాకవి వడ్డమూడి శత జయంతి ఉత్సవం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజాకవి, నాటక రచయిత, రైతు ఉద్యమ నేత అమరజీవి వడ్డమూడి నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవం ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో జరుగుతుందని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనీల్, విబిసి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వడ్డమూడి రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవంలో వడ్డమూడి రచనల గురించి ప్రజాకవి దేవేంద్ర, అంకురం సినిమా దర్శకుడు సి.ఉమా మహేశ్వరరావు, రైతు ఉద్యమ నేతగా వడ్డమూడి కృషిని రైతు సంఘ నాయకులు వై.కేశవరావు తదితరులు మాట్లాడతారని తెలిపారు. వడ్డమూడి రచించిన పాటలు, నృత్య రూపకాలను కళాకారులు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

చట్టాల సవరణలపై న్యాయవాదులు గళం విప్పాలి : ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు

విజయవాడ : ప్రజల హక్కుల్ని కాల రాసేలా ఉన్న చట్టాల సవరణపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని దీనిపై దేశ వ్యాప్తంగా న్యాయవాదులు తమ గళం విప్పాలని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్ సురేష్ బాబు సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం స్థానిక కార్యాలయంలో జరిగింది. పాలక బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల ప్రాంతాల మధ్య విభజన తెస్తూ ఉందని ఆ క్రమంలోనే బ్రిటీష్ కాలం నాటి చట్టాల సవరణ పేరుతో పాలకులకు అనుగుణంగా సవరణ చేశారని, ఇది పౌర హక్కుల్ని, ప్రశ్నించే హక్కుల్ని కాలరాయడమే అని వివరించారు. భూ హక్కు సవరణ చట్టం రద్దు చేయడం హర్షించదగ్గదని అన్నారు. గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు, అధ్యక్షులు చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల హక్కుల రక్షణ, సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. కర్నూల్, విశాఖ ప్రాంతాల్లో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ న్యాయవాదుల సంఘం మహాసభలు త్వరలో జపాన్ లో జరుగనున్నాయని వివరించారు. కేరళ రాష్ట్రంలో సభవించిన వరదల బాధితుల సహాయార్ధం అసోసియేషన్ తరుపున విరాళాలు అందజేయాల్సి ఉందని అన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు కె.పరమేశ్వరరావు, వి.చంద్రశేఖర్, వెలుగూరి రాధాకృష్ణ, వెంకట్ మాట్లాడారు. వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - విజయవాడ : దోమ కాటు వల్ల కలుగు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి జ్వరాలను అరికట్టేందుకు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, శనివారం సాయంత్రం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 64 డివిజన్లో ప్రజా ఆరోగ్య విభాగం పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ప్రజలను జ్వరాల బారిన పడకుండా ఆటో ఫాగింగ్, హ్యాండ్ ఫాగింగ్ చేశారు. కేదారేశ్వరపేట, ఫైజర్ పేట, ఆంజనేయ వాగు, బాంబే కాలనీ (ఏ,బి,హెచ్ బ్లాకులు), రాజీవ్ నగర్, ద్వారక నగర్, నల్లగేట్ సెంటర్, శివశంకర పురం, హరినాధపురం, చౌదరి పేట, భ్రమరాంబపురం, గాయత్రి నగర్, పటమట, ఫన్ టైమ్స్ క్లబ్ రోడ్, కోనేరు వారి స్ట్రీట్, జెడి నగర్, లక్ష్మీపతి కాలనీ, అయ్యప్ప నగర్ సిరీస్ రోడ్ ధనికుల వారి వీధి కవేపాకు స్ట్రీట్, బావాజీపేట శ్రీనగర్ కాలనీ, సత్యనారాయణపురం, బ్రాహ్మణ స్ట్రీట్, ఆర్‌ఆర్ అప్పారావు స్ట్రీట్, తారాపేట, బి ఆర్ పి క్రాస్ రోడ్, సందు ఆటో ఫాగింగ్, ఇతర ప్రాంతాల్లో హ్యాండ్ ఫాగింగ్ చేసి దోమలను నియంత్రించారు. 64 డివిజన్లో కూడా హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎంపి కేశినేని చిన్ని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గత ప్రభుత్వ వైఫల్యాలను వెలుగెత్తి చాటి, టిడిపి అధికారంలోకి రావటానికి విశేష కృషిచేసిన నాయకులు బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలకు మంచి పదవులు వస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. శనివారం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కార్యాలయంలో ఎంపి కేశినేని చిన్ని పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ చిన్ని మాట్లాడుతూ పొత్తుల్లో భాగంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే సీటును బిజెపికి ఇవ్వాల్సి వచ్చిందన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపి కార్యకర్తలు, నాయకులు కొంత ఇబ్బంది పడుతున్నారని, ఆ విషయం నాకు తెలుసని, దీన్ని అధిష్ఠానం దష్టికి సాధ్యమైనంత త్వరగా తీసుకువెళతానని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ పదవి లేక పోవడంతో ప్రజలకు, నన్ను నమ్ముకున్న వారికి ఏమీ చేయలేక పోతున్నానని ఆవేదనవ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకులు నాగుల్‌మీరా పాల్గొన్నారు.

వేడుకల్లో టిడిపి నాయకులు

విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) పుట్టినరోజు సందర్భంగా 48వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పేరాబత్తుల రమణ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శనివారం చిట్టినగర్ సెంటర్లోని రమణ కార్యాలయం వద్ద కేశినేని చిన్ని పేరిట భారీ కేక్‌ను ఏర్పాటు చేయగా తెలుగుదేశం యువ నాయకులు కాండ్రేగుల రవీంద్ర కేక్ కట్‌చేసి చీరల పంపిణీ ప్రారంభించారు. విస్సన్నపేటనందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట మండలాల్లో పలుచోట్ల ఎంపి చిన్ని జన్మదిన వేడుకలు నిర్వహించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్‌లోని జడ పాపయ్య వీధి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలనతో పాటు మహంతిపురం ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షాలకు మహంతిపురం, గొల్లపాలెం గట్టు ముంపునకు గురవుతున్నాయని, ముంపు నివారణ చర్యలు చేపట్టవలసిందిగా పలుమార్లు కౌన్సిల్‌లో తీర్మానాల ద్వారా కమిషనర్లకు వినతి పత్రాల ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. మూడు డివిజన్లో మురుగు ముంపు నీరు ఈ ప్రాంతంలోకి రావడంతో గంట పాటు ప్రజల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రత్యామ్నాయ మార్గాలని పరిశీలించాలని వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. కేటీ రోడ్డు తూర్పు భాగంలో పడమర భాగంలో డ్రైన్ వెడల్పు చేసి రాజా హైస్కూల్ ఎదురుగా ఉన్న అవుట్ఫాల్ డ్రైన్‌కి అనుసంధానం

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

చేయవలసిందిగా కౌన్సిల్లో ప్రతిపాదించగా ఆమోదించినా అధికారులు ఆ దిశగా స్పందించకపోవడం బాధాకరమన్నారు. జడా పాపయ్య వీధి మిగిలినచోట ప్రాంతంలో పాడైపోయిన రోడ్డును వెంటనే మంజూరు చేసి నిర్మాణం చేయాలని కోరారు. ఔట్ఫాల్ డ్రైన్ డి షిల్టును రెగ్యులర్‌గా చేయాలని కోరారు. రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేయాలన్నారు.

మిల్క్ ఫ్యాక్టరీలో కాకాని వెంకటరత్నం జయంతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్వాతంత్ర్య పోరాట సమరయోధుడు, రైతు బాంధవుడు, ఉక్కు మనిషి దివంగత కాకాని వెంకటరత్నం 124వ జయంతి వేడుకలు శనివారం మిల్క్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణంలో గల స్వర్గీయ కాకాని వెంకటరత్నం కాంస్య విగ్రహానికి కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు

కాకాని వెంకటరత్నం విగ్రహానికి పూలమాలవేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకాని వెంకటరత్నం సామాన్య రైతు బిడ్డగా జీవితం ప్రారంభించి వివిధ ఉన్నత స్థాయిలో ఎదిగారన్నారు. రైతు సమస్యల పరిష్కా రానికి నిర్విరామంగా కృషి చేసిన వ్యక్తి అని, ముఖ్యంగా వివిధ ముఖ్య మంత్రుల క్యాబినెట్‌లలో వ్యవసాయ, పశుపోషక, పాలసేకరణ శాఖలకు మంత్రిగా పనిచేసి పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేశారని చలసాని ఆంజనేయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు శేషుమణి, గాదె ఆదిలక్ష్మి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బాలికల పట్ల లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు అరికట్టాలని ఐద్వా పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కుండనాల శేషుమణి, గాదె ఆదిలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. భవానీపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాల ప్రిన్సిపాల్ అన్నదాసు శ్రీనివాసరావు లైంగిక వేధింపులకు పాల్పడడం బాధాకరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించకుండా ఫోక్సో కేసులు పెట్టి కఠిన శిక్షలు విధించాలని కోరారు. ముక్కుపచ్చ లారని బాలికలని కూడా చూడకుండా పాఠశాలల ఉపాధ్యాయులు దుశ్చర్యలను తీవ్రంగా ఖండించారు. వారికి పిల్లలు ఉంటారనే ఆలోచన కూడా లేకుండా విద్యాభ్యాసం కోసం వచ్చే బాలికల పట్ల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు లైంగిక వేధింపులను ప్రభుత్వం, పోలీసులు ఉపేక్షించకుండా కఠిన చర్యలు గైకొనాలని డిమాండ్ చేశారు. రవీంద్ర భారతి పాఠశాలలో బాలిక పట్ల లైంగిక వేధింపులు జరిగి ఒక రోజు గాకుండానే వన్‌టౌన్‌లోని బాపనయ్య స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న చిన్నారిని ఉపాధ్యాయిని తీవ్రంగా కొట్టడం క్షమించరానిదన్నారు. రాష్ట్రంలో మద్యం మత్తులో మహిళల పట్ల అఘాయిత్యాలు, అత్యాచారాలు, ఆత్మహత్యలు ఎక్కువవ్వాయని, వీటిపై కఠిన చట్టాలు అమలుచేసి మహిళలు, బాలికల్లో మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. బాలికల పట్ల లైంగిక వేధింపులు నివారించకపోతే మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లిలోని షాదీఖానాలో నిల్వ చేసిన అక్రమ రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొండపల్లిలో అక్రమ రేషన్ నిల్వలు ఉన్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సుమారు 6 క్వింటాలు రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా రాత్రి సమయంలో తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు దాడులు నిర్వహిం చారు. బొమ్మల తయారీ కోసం అంటూ స్థలాన్ని బాగు చేసుకుని అక్రమ రేషన్ నిలువ ఉంచినట్లు స్థానికులు తెలిపారు. కొండపల్లికి చెందిన కాజా అనే వ్యక్తి రేషన్ తరలి స్తున్న క్రమంలోనే అధి కారులు పట్టు కున్నా రు. బియ్యం పం పిణీ చేసే

నిల్వ ఉంచిన బియ్యం

వాహనం కూడా తన పేరు మీదే ఉండటం, తానే స్వయంగా వాహనం ద్వారా అక్రమ రవాణా చేయటంపై అధికారులకు వచ్చిన సమాచారం మేరకు పట్టుకోగా విషయాలన్నీ బయటకు వచ్చాయి. ఇంటింటికి పంపిణీ చేసే వాహనాన్ని ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వాహనంలో 46 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన స్థలంలో 105 బస్తాల వరకు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బాలుడికి 'దీవెన' సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తోటి విద్యార్థులు పెట్రోల్ పోసి నిప్పంటించగా 60 శాతం ఒళ్ళు కాలిపోయి హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కిషోర్ (13) తల్లిదండ్రులు పేదవారు. వీరు కుమారుడి చికిత్స సహాయం నిమిత్తం కుటుంబ సభ్యులు దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో శనివారం దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని హెడ్ కానిస్టేబుళ్ళు శ్రీనివాసరావు, రామకృష్ణ, మహిళా కానిస్టేబుల్ దివ్య హాస్పిటల్‌కి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.

విద్యాధరపురంలోని రేషన్ డిపో డీలర్ గురునాధరావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న దృశ్యం

చౌక దుకాణంలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు 44వ డివిజన్ చెరువు సెంటర్‌లోని చౌక దుకాణాలను శనివారం ఎంఎల్ఏ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తనిఖీ చేశారు. రేషన్ షాపుల పనితీరు, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించి రేషన్ డీలర్ కోట గురునాధరావుతో ముఖాముఖి చర్చించారు. క్షేత్రస్థాయిలో చౌక దుకాణాల పనితీరుపై ప్రత్యేక పరిశీలన చేస్తున్నామ న్నారు. పశ్చిమలోని 120 చౌక డిపోల ద్వారా పదివేల మంది లబ్ది పొందుతు న్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందించేలా కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డివిజన్ ప్రెసిడెంట్ బొడ్డపల్లి శ్రీనివాసరావు, బిజెపి మండల అధ్యక్షులు పచ్చిపులుసు శివప్రసాద్ పాల్గొన్నారు.

అఖిలాండేశ్వరిని దర్శించుకున్న న్యాయమూర్తి కుమారుడు

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని జుజ్జూరు గ్రామంలోనే సర్వజ్ఞపీఠంలో వెలిసిన ఉన్న అఖిలాండేశ్వరి అమ్మవారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కుమారుడు జానకి రామ్ శ్రీధర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాను ఢిల్లీలో పిహెచ్‌డి చేస్తున్నానని జుజ్జూరులో ఉన్న అఖిలాండేశ్వరి అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆనంతరం యోగి నరేంద్రనంద స్వామీజీ వారికి అమ్మవారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల లో సైబర్ క్రైమ్ లపై ఇబ్రహీంపట్నం సిఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల పై విద్యార్థులకు అవగాహన ఎంతైనా అవసరమన్నారు. ఆన్ లైన్ ట్రేడింగ్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి అని పేర్కొన్నారు. పాఠశాల బస్ స్టాప్ దగ్గర సెక్యూరిటీ అవసరమని విద్యార్థులు అడిగారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి భూ సమస్యలకు సంబంధించిన అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భూములకు నష్టపరిహారం చెల్లింపు, ల్యాండ్ అలినేషన్, 22ఏ భూముల తొలగింపు, గన్నవరం ఎయిర్పోర్ట్, మచిలీపట్నం పోర్టు, భారత్ సాల్ట్, మల్లవల్లి పారిశ్రామిక వాడల భూసేకరణ, సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ముఖ్యంగా కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివాదాస్పద భూ సమస్యలను పరిష్కరించే విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. భూములకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో వాస్తవ హక్కుదారులను గుర్తించాలన్నారు. మచిలీపట్నం పోర్టు భూసేకరణకు సంబంధించిన 45 ఎకరాల అసైన్డ్ భూమి కోసం ఎల్ పి షెడ్యూల్ వివరాలతో కూడిన రిప్రజెంటేషన్ సమర్పించాలని, భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిబంధనలను పాటించాలని కలెక్టర్ పోర్టు అధికారులకు సూచించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎన్ని లేఔట్లకు భూపరిహారం చెల్లించారు, ఇంకా చెల్లించాల్సినవి, పరిహారం చెల్లింపునకు ఉన్న సమస్యల వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ డిఆర్ఓ శ్రీదేవి, బందరు, గుడివాడ, ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ల అధికారులు ఎం వాణి, పి పద్మావతి, డి రాజు, భూ రికార్డులు సర్వే ఏడి మనీషా త్రిపాఠి, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, మచిలీపట్నం పోర్టు, గన్నవరం ఎయిర్పోర్ట్ అధికారులు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు తహశీల్దార్‌గా మల్లికార్జునరావు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం తాసిల్దారుగా టి. మల్లికార్జున రావు శనివారం బాధ్యతలు చేపట్టారు.

సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా అమలాపురంలో తాసిల్దారిగా విధులు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల బదిలీలో భాగంగా గుడ్లవల్లేరు మండల తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డిప్యూటీ తాసిల్దార్ కనకదుర్గ, ఆర్ఐ షకీలా బేగం, సూపరింటెంట్ రాజశేఖర్, చిరంజీవి మరియు మండల వీఆర్వోస్ సంఘ అధ్యక్షులు వెంకన్న, ప్రకాష్, రవి, మల్లికార్జునరావు, భాస్కర్‌రావు, రామస్వామి అభినందనలు తెలిపారు.

ముఠా కార్మికులపై అధికారుల ఒత్తిడి తగదు

ప్రజాశక్తి-గుడివాడ : ముఠా కార్మికులపై ప్రభుత్వ అధికారుల ఒత్తిడి విరమించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏలూరురోడ్డులోని సిపిఐ కార్యాలయంలో కృష్ణాజిల్లా ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ గుడివాడ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తాతయ్య మాట్లాడుతూ కార్మికుల పోరాటాలకు పుట్టినిల్లు అయిన గుడివాడలో కృష్ణాజిల్లా ఏఐటియుసి మహాసభలను అక్టోబర్ నెలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు కృష్ణాజిల్లా నలుమూలల నుండి వందలాదిమంది కార్మికులు తరలిరావాలన్నారు. నేడు ప్రభుత్వ రంగంలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ కార్మికులను బేషరతుగా పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పోరాటాలు నిర్వహించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లింగం ఫిలిప్స్, ఓ.ఎల్ రావు, ఉమామహేశ్వరరావు, దుంపల వెంకటనరసింహారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఆధునీకరణ పనులు

ప్రజాశక్తి-గన్నవరం: రంగన్నగూడెం గ్రామంలో ఆర్‌డిఎస్ఎస్ విద్యుత్ ఆధునీకరణ పనులలో భాగంగా మొదటి విద్యుత్ స్తంభం నిలబెట్టి పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపిటిసి పుసులూరు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ : ప్రతి తల్లి పుట్టిన బిడ్డకు 6నెలల వరకు పాలను అందిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పెద్దఎరుకపాడు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ హెచ్ ఎం దాసు అన్నారు. శనివారం స్థానిక 25వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా హెచ్.ఎం. దాసు మాట్లాడుతూ బాలింతలకు, గర్భవతులకు తల్లి పాల గురించి వివరించి తల్లి పాలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.ఎం లలితమణి, ప్రమీలారాణి, ఎం.నవ్య, అరుణ పాల్గొన్నారు. **తోట్లవల్లూరు:** మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామం అంగన్వాడి సెంటర్ 2లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అంగన్వాడీ కార్యకర్త మీనాక్షి సీతారావమ్మ, ఏఎన్ఎం ప్రసన్న, సరిత పాల్గొన్నారు. **అవనిగడ్డ:** బిడ్డకు జన్మనిచ్చిన గంట నుండి తల్లిపాలు పట్టడం

ద్వారా బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారని అవనిగడ్డ సిడిపిఓ పి.సురేష్ కుమారి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పంచాయతీ పరిధిలోని సీతయ్యలంక అంగన్వాడి కేంద్రం వద్ద తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రోగ నిరోధక టీకాలను కూడా వేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ప్రియాంక, అరుణ, ఎన్ ప్రేమలత పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

సోమేశ్వరస్వామి ఆలయంలో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరులోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం దేవాదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్ జేసీ కె.సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ శోభారాణి ఆధ్వర్యంలో రికార్డులు తనిఖీ చేపట్టారు. దేవస్థానానికి చెందిన సుమారు 26 ఎకరా ల పొలంలో 6 ఎకరాలు విజయవాడ- మచిలీపట్నం హైవే నిర్మాణంలో పోగా దేవస్థా నానికి రూ.8.36 కోట్లు ఆదాయం వచ్చింది. రాగా ఆమొత్తాన్ని బ్యాంకులో ఫిక్స్ డి పాజిట్ చేశారు. దానికి సంబంధించి ఐదేళ్లుగా వడ్డీరూపంలో వచ్చిన మొత్తం, ఆలయా నికి వచ్చే ఆదాయం ఆలయ ఈవో సరేశ్ పక్కదారి పట్టించినట్టు వచ్చిన ఆరోపణలు పై అధికారులు విచారణ చేపట్టారు. సోమేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ పై వచ్చే వడ్డీలో నిబంధనల ప్రకారం 2/3 వంతు దేవస్థానం ఖర్చులకు, 1/3 వంతు ఫిక్స్ డి పాజిట్ చేయాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా బ్యాంకునుంచి సొమ్ము డ్రాచేసి ఆమొత్తాన్ని పక్కదారి పట్టించారని వార్తాపత్రికల్లో వచ్చిన కథనంమేర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేర విచారణ, రికార్డులు తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తా మని ఆర్జేసీ కె.సుబ్బారావు తెలిపారు.

ఉద్యాన రైతులకు రాయితీ బకాయిలు విడుదల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణా జిల్లాలో ఉద్యాన పంటలు పండిస్తున్న రైతులకు ఇది వరలో రావలసిన రాయితీ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వము విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. ఈ మేరకు 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద రైతులకు రావలసిన రాయితీ బకాయిలు ఇప్పటికే రు.20 లక్షలు నిధులు విడుదల చేసారన్నారు. తదనుగుణంగా జిల్లా స్థాయిలో తన ఆమోదంతో రైతుల ఖాతాలలో రాయితీ నిధులు జమ అయ్యేట్టు కార్యాచరణ కూడా జరిగిందన్నారు. అదే విధంగా 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆయిల్ పామ్ పంటకు సంబంధించిన రాయితీ నిధులు 40 శాతం మేరకు రు. 113 లక్షలు విడుదల చేయటం జరిగిందన్నారు. ఈ నిధులు కూడా రైతుల ఖాతాలలో జమ అయ్యేట్టు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అంతేకాకుండా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన శాఖ ద్వారా రైతులకు ఆర్థిక చేయూతగా వివిధ పంటలకు సంబంధించిన రాయితీలు ప్రకటిస్తూ విధివిధానాలు, మార్గదర్శకాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలోజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ కె.వి రామకృష్ణయ్య శనివారం ప్రజలతో కలిసి అన్ని విభాగాల పనితీరును పరిశీలించారు. ఈ ఆకస్మిక పరిశీలనలో ఐసీయూ విభాగంలో ఏసీలు పనిచేయక దుర్గంధం వెదజల్లుతున్న విషయాన్ని స్వయంగా గుర్తించడంతో సంబంధిత అధికారులను ప్రశ్నించగా వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఏసీలను రిపేరు చేయించి రోగులకు అందుబాటులోనికి తీసుకురావాలని, శానిటైజేషన్ విషయంలో అశ్రద్ధ వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని

హెచ్చరించారు. రోగులకు అన్ని సమయాల్లో అవసరమైన వైద్య సహాయం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని వైద్య అధికారులను నర్సింగ్ సిబ్బందిని ఆదేశించారు.

ధన్వంతరి వార్డు ప్రారంభం

ప్రజాశక్తి-మొవ్వ: కూచిపూడి గ్రామంలోని రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని సాయి ఆరోగ్య ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ధన్వంతరి వార్డ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, మండలి బుద్ధప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గీతాబాయి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు ఎన్నారై కూచిబొట్ల ఆనంద్‌ను మంత్రి సత్యప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రవిప్రకాష్, కూచిపూడి సర్పంచ్ విజయలక్ష్మి, డాక్టర్ పోలన అశోక్ పాల్గొన్నారు.

మరో ఇద్దరికి రిమాండ్

ప్రజాశక్తి-గన్నవరం: టిడిపి కార్యాలయం పై దాడి కేసులు మరో ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులైన యూసఫ్ , మెండెం రాంబాబులను అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో పెట్టారు. గన్నవరం కోర్టు న్యాయమూర్తి నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారు. ఇద్దరు నిందితులను నూజివీడు సబ్ జైలుకు తరలించారు. మిగతావారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వైసిపి నేతలకు పరామర్శ

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, వైసిపి నాయకులు కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని మాజీమంత్రి పేర్ని నాని విమర్శించారు. టీడీపీ ఆఫీసు పై దాడి ఘటనలో శిక్ష అనుభవిస్తున్న వైసీపీ నాయకులను గన్నవరం సబ్ జైలులో ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని చెప్పారు. జగన్ నాయకత్వంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తలసిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-చల్లపల్లి: శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి విఆర్‌కె నగర్, ఎస్ఆర్‌వైఎస్‌పి కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ (బ్లడ్ క్యాంప్స్) టి.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన చిగురుపాటి మంజువాణి.. వరప్రసాద్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్త సేకరణ చేశారు. శిబిరంలో 50 మందికి పైగా దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్, ప్రిన్సిపాల్ పి.రమేష్ బాబు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, కొల్లిపర మధు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజుల అశ్వినీ కుమార్, బీడీఆర్ పాల్గొన్నారు.

హౌసింగ్ ఎఇ నారాయణకు సత్కారం

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ హౌసింగ్ ఎఇ వి.వి.నారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, ఎంపీపీ కొండేటి ఇందిరా చందు, ఎమ్మార్వో మస్తాన్, సర్పంచ్ పూర్ణచంద్రరావు, వేమూరి పరిశుద్ధ రాజు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ క్షేత్రయ్య గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో మాదకద్రవ్యాల వినియోగించడం వల్ల వచ్చే ఇబ్బందులు, ర్యాగింగ్ నివారణ, గురించి మొవ్వ జడ్జి శ్రీ పి. రాజన్ ఉదయ ప్రకాష్ విద్యార్థి విద్యార్థులకు డ్రగ్స్ పట్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఏ ప్రసాద్ శాస్త్రి, అడ్వకేట్ జి శ్రీనివాసరావు, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్, మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై పశువుల సంచారంతో ఇబ్బందులు

ప్రజాశక్తి - విస్సన్నపేట : మండల కేంద్రమైన విస్సన్నపేటలో ఎన్డీఏ కూటమి భారతీయ జనతా పార్టీ విస్సన్నపేట ఎస్సీ మోర్చా తరపున మండల అధ్యక్షులు లాం కొండలరావు ఆధ్వర్యంలో ఎంపీడీవోకు, గ్రామపంచాయతీ ఈవోకి, హౌస్ ఆఫీసర్‌లకు గోవులు విచ్చల విడిగా ప్రధాన రహదారుల్లో సంచరిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్నందున గోవులను సంబంధిత యజమానులకు తెలియపరచి నివారించాలని యజమానులు లేని గోవులను గో శాలలకు అప్పగించి ప్రజల ప్రాణాలకు ముప్పును తప్పించాలని ప్రజలు కోరుతున్నారు. వాహన చోదకులకు బాటసారులకు తీవ్ర అసౌకర్యంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా అధిక సంఖ్యలో సంచరిస్తూ ప్రధాన రహదార్లపైనే పడుకోవటం వలన ట్రాఫిక్ కి కూడా తీవ్ర అసౌకర్యంగా మారిపోయింది. విస్సన్నపేటలోని మెయిన్ రోడ్లపై నివసిస్తున్న గోవులను వారి యజమానులకు తెలియపరచి గోశాలకు తరలించి ప్రమాదాల నివారణకు చర్య తీసుకోవాలని మండల అన్ని శాఖల అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పులపాక బాబు జిల్లా ఎస్సీ మోర్చా మేడా కమలాకర్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి రోడ్‌లో శనివారం వ్యవసాయ పనులకు వెళుతున్న మహిళను అడ్డగించి బంగారపు నానుతాడుతో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన సుంకర సుభద్ర మరో ఐదుగురితో కలిసి తిరుమలగిరి రోడ్డులో ఉన్న వ్యవసాయ భూమిలో కలుపు మొక్కలు తీసేందుకు ఆటో దిగి వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను తోసి నానుతాడుతో పరారయ్యారు. చిల్లకల్లు పోలీసులకు బాధితురాలు సుభద్ర ఫిర్యాదు చేశారు.

క్రిస్టియన్ పేటలో చోరీ

పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో గల క్రిస్టియన్ పేటలో తంగిరాల రమణ ఇంటిలో అర్ధరాత్రి దుండగులుచోరీకి పాల్పడిన దుండగులు. లోపలికి చొరబడి నిద్రిస్తున్న మహిళలను చిన్నపిల్లలను చూసి టీవీ పక్కనే ఉన్న బ్యాగును పట్టుకొని పరారైన దుండగులు. బ్యాగులో ఉన్న గ్యాస్ బుక్కుకు, పట్టీలు, 9500 రూపాయలు ఉండడంతో లబోదిబోమన్న మహిళలు.

వ్యవసాయ శాఖ అధికారుల సందర్శన

జగ్గయ్యపేట : వ్యవసాయ శాఖ ఎన్టీఆర్, వ్యవసాయ పరిశోధన స్థానం గరికపాడు సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ, సందర్శన ఆగష్టు నెల కార్యక్రమాన్ని శనివారం మండలంలోని గరికపాడు వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమన్యమ్మ,కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్. ఎస్. కష్టంరాజు, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్. బి. వెంకటేశ్వర్లు, జిల్లా వనరుల సంస్థ జిల్లా అధికారిని శ్రీమతి. టీ. మాధవి లత ఆంధ్ర ప్రదేశ్ సహజ వ్యవసాయ సంఘం జిల్లా అధికారి విజయ కుమారి పాల్గొన్నారు. జిల్లాలోని ప్రస్తుత పంటలు వాటిలోని సమస్యలను చర్చించి వాటికి తగిన సూచనలను వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం వ్యవసాయ పరిశోధన స్థానంలోని కంది, వరి, పెసర పంటలను వీక్షించి వాటిలోని తెగులు, పురుగులు, సూక్ష్మ ధాతు లోపాలు నివారణ గురించి శాస్త్రవేత్తలు అధికారులకు వివరించారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి వీరులపాడు : పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్ముడు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రానికి ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నందిగామ పరిధిలో ఇసుకను లోడ్ చేసుకున్న ట్రిప్పర్ డ్రైవర్లు వారికి కేటాయించిన రూట్ మ్యాప్ ప్రకారం మాత్రమే వెళ్లాలని అలా కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ఏదైనా గ్రామం వైపు వెళ్తే పోలీసులు అటువంటి వాహనాన్ని సీజ్ చేస్తారని తెలిపారు. సరైన బిల్లు లేకుండా ఇసుకను రవాణా చేసిన అటువంటి వాహనాలను అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం : సిఐటియు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : చిరు ప్రాణులైన పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించటం అంటే ఏమిటో నేటి కూటమి ప్రభుత్వ నాయకుల పద్ధతిని చూస్తే అర్థమవుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.సుధాకర్ అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వ స్థానిక నాయకులు రెడ్డిగూడెం మండలంలో ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు, ఆయాలను, వెలుగు పథకంలో పనిచేస్తున్న బుక్కు కీపర్‌లను తొలగించేందుకు ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో ఖాళీగా ఉన్న మూడు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను మాత్రమే భర్తీ చేయవలసి ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వ నాయకుల ఒత్తిడితో ఇప్పటికే పనిచేస్తున్న ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని, వారి స్థానంలో కూటమి ప్రభుత్వ సానుభూతిపరులను పెట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని తెలుస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపును ఆపాలని, మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ఆయాలను సైతం తొలగించే ప్రక్రియ కూటమి ప్రభుత్వ స్థానిక నాయకులు ప్రారంభించారని, నాగులూరు హైస్కూల్, నాగులూరు బిసి కాలనీ ఎంపిపి స్కూలు, కుదప హైస్కూల్, ముచ్చినపల్లి ఎంపియుపి స్కూల్‌లో వంట ఏజెన్సీలను తొలగించి అధికార పార్టీ వారిని వంట ఏజెన్సీలుగా తీసుకోవడం వల్ల కూడా ఆయా కుటుంబాలు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను సైతం తొలగించడం అన్యాయమన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి : సిఐటియు

విజయవాడ రూరల్ : విపంచాయతీ కార్మికులకు వేతనాలు చాలక ఇబ్బందులు పడుతున్నారని వేతనాలను పెంచాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రామవరప్పాడు గ్రామపంచాయతీ కార్మికులతో ఎ.పి.గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేడు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వారు మాట్లాడారు. రామవరప్పాడు గ్రామ పంచాయితీలో స్వీపర్స్, డ్రైనేజ్ క్లీనర్స్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిషియన్, డ్రైవర్లు తదితర విభాగాల్లో అనేక సంవత్సరాలుగా కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వీరు గ్రామాల్లోని ప్రజలకు పారిశుధ్యం, ప్రజారోగ్యం రక్షణలో విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం వస్తున్న వేతనాలు చాలక కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నాయని, ప్రస్తుతం ఇస్తున్న రూ.10,500ల వేతనంతో జీవనం గడవటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ విభాగాలలో పనిచేసే కార్మికులకు వేతనాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్న వేతనాల కమిటీ నిర్ణయిస్తుందని, అందులో భాగంగా ఆర్సి నెం:ఎ/1102/2023, 8.8.2023 ద్వారా 2023-2024 సంవత్సరాలకు కనీస వేతనాలను నిర్ణయించారని పేర్కొన్నారు. దాని ప్రకారం రోజుకు అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.569లు, సెమిస్కిల్డ్ వర్కర్లకు రూ.683లు, స్కిల్డ్ వర్కరు రూ.797లు చొప్పున చెల్లించాలని ఆదేశించారన్నారు. రామవరప్పాడు గ్రామపంచాయితీలోని కార్మికులకు కలెక్టర్ ఆధ్వర్యంలోని వేతనాల కమిటీ నిర్ణయించిన దానికి తగ్గకుండా వేతనాలు నిర్ణయించి చెల్లించవలసినదిగా వారు డిమాండ్ చేశారు. **నూతన కమిటీ ఎన్నిక :** గౌరవాధ్యక్షులుగా సిఐటియు విజయవాడ రూరల్ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, అధ్యక్షులుగా సీతారామరాజు, కార్యదర్శిగా వీరమ్మ, కమిటీ సభ్యులుగా రాధ, శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. వేతనాల పెంపుదల, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందించాలని పరిష్కారం కాని పక్షంలో అవసరమైతే సమ్మెతో సహా ఆందోళనలకు సిద్ధం కావాలని నిర్ణయించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - నందిగామ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలని సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందిగామ ఆర్డీవో రవీంద్ర రావు సిఐటియు నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గ పరిధిలోని నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు 4 నెలల నుండి వేతనాలు రాక ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.వారికి ఇచ్చే వేతనమే చాలా తక్కువగా ఉందన్నారు. వాటిని కూడా నెలల తరబడి పెండింగ్లో పెట్టడంతో వచ్చే జీతంపైనే ఆధారపడి జీవిస్తున్న వీరికి కుటుంబాలు గడవడం చాలా కష్టంగా ఉందన్నారు. వెంటనే వీరికి బకాయి వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం వచ్చిన తరువాత రాజకీయ కారణాలతో స్కూల్ శానిటేషన్ వర్కర్లపై వేధింపులు, తొలగింపులకు పాల్పడుతున్నారని, బెదిరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్ వర్కర్ల సంఖ్యను పెంచాలని సిఐటియు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, సిఐటియు నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, వరలక్ష్మి,ప్రైమునిని, నరసింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేపై తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు : గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపట్టి జ్వర లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశించారు. శనివారం మండలంలోని కాకర్ల, ఆంజనేయపురం గ్రామాల్లో జరుగుతున్న జ్వరపీడితుల గుర్తింపు సర్వేని డిఎం అండ్ హెచ్ ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వరాల నియంత్రణకు రెండు గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఇటీవల కిడ్నీ సమస్యతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆంజనేయపురం గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావుతో సమావేశమై పారిశుధ్యం మెరుగుదలకు తీసుకో వలసిన చర్యలపై చర్చించారు. డ్రై డే కార్యక్రమాల నిర్వహణ, వాటి నమోదు వివరాలపై ఆరా తీశారు. అనంతరం జ్వర పీడితుల గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన మందులు, నిర్ధారణ పరీక్షలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కార్మికులను తొలగించొద్దని వినతి

జగ్గయ్యపేట : ప్రభుత్వ పాఠ శాలలు, కళాశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు అనేక సంవత్స రాలు గా పాఠశాల, కళాశాల పరిస రాలను, మరు గుదొడ్లను శుభ్రం చేస్తున్న తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని ఏపీ ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు షేక్ గౌస్‌మియా, ఎస్.రామనాథం తెలిపారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి ఎల్.చిట్టిబాబును చిల్లకల్లు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కలిసి శానిటేషన్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించొద్దని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

ఇబ్రహీంపట్నం సిఐ బదిలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం సిఐగా పనిచేస్తున్న ముత్యాల సత్య నారాయణ బదిలీ అయ్యారు. గవర్నర్ పేట సిఐగా నియమిస్తూ పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఎన్నికల సమయంలో ఎంతో సమర్ధవంతంగా పని చేసి సిబ్బంది సహకారంతో మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూశారు.

పారిశుధ్య పనులు

ప్రజాశక్తి విస్సన్నపేట : పుట్రేల గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా వీధివీధిలో బ్లీచింగ్ చల్లారు. విష జ్వరాలు ప్రబలుతునందున గ్రామ సీనియర్ నాయకులు శ్రీమద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి సచివాలయం సెక్రటరీ, శోభన్ గారు, హెల్త్ డిపార్ట్మెంట్ వారు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

సిసి రోడ్లు డ్రైనేజీలు ప్రారంభం

జగ్గయ్యపేట: మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో స్టీల్ ప్లాంట్ వారి సి.ఎస్.ఆర్ నిధులతో రూ.22 లక్షలతో రెండు సిసి రోడ్ల డ్రైనేజీలను నిర్మించారు. ఆ డ్రైనేజీలను వి.ఎస్సీ అధికారులు, నాయకులుతో కలిసి ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య ప్రారంభించారు.

ఎంఎల్‌ను కలిసిన మిలిటరీ జవాన్లు

జగ్గయ్యపేట : పట్టణంలో ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్యను వారి నివాసంలో పారా మిలటరీ ఫోర్స్‌కి సంబంధించిన జవాన్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తాతయ్యకి విన్నవించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని తాతయ్య వారికి హామీ ఇచ్చారు.

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగింత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి లో జరిగిన బాలుడు మిస్సింగ్ కేసును ఇబ్రహీంపట్నం సీఐ ముత్యాల సత్యనారాయణ చేధించి తల్లికి అప్పగించారు. కొండపల్లికి చెందిన ఉదయ్ కుమార్ స్థానిక క్రాంతి హై స్కూల్‌లో చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం తప్పిపోవడంతో తల్లి నరసమ్మ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ముత్యాల సత్యనారాయణ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో పోలీసులు వెతికారు. విజయవాడ బస్టాండ్‌లో బాలుడు సురక్షితంగా పోలీసులకు దొరికాడు. శనివారం సీఐ సత్యనారాయణ బాలుడిని తల్లికి అప్పగించారు. బాలుడిని వెతికి సురక్షితంగా అప్పగించడంతో తల్లి సీఐ సత్యనారాయణకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సిఐ

గుడివాడ అభివృద్ధికి నిధులు మంజూరు : బాలశౌరి

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ నియోజకవర్గం అభివద్ధి కోసం ప్రత్యేక దృష్టి పెట్టి అత్యధికంగా నిధులు మంజూరుకు కృషి చేస్తానని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. శనివారం గుడివాడ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు. అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలసి మున్సిపల్, ఇతర అధికారులతో సమీక్షా, సమావేశాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎంపి బాలశౌరిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపి బాలశౌరి మాట్లాడుతూ గతంలో అమృత్ ఫేజ్-2లో వచ్చిన నిధులు ఎంత వరకు ఖర్చు చేశారని అధికారులను ప్రశ్నించారు. ఇప్పుడు ప్రజల అవసరాలు తీర్చేందుకు కావలసిన నిధులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అంచనాలు సిద్ధం చేస్తే, నిధులు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానన్నారు. టిడ్కో కాలనీలో టిడ్కో శాఖ, మున్సిపల్ అధికారులు ప్రజలకు అవసరమైన త్రాగునీరు విషయంలో ప్రత్యేక దృష్టిని పెట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నిటిని నెరవేర్చడం జరుగుతుందన్నారు. టిడ్కో కాలనీలో రూ.1కోటితో

అధికారులతో మాట్లాడుతున్న ఎంపి బాలశౌరి

ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం నిధులతో కమ్యూనిటి హాల్ నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణంలో బైపాస్-రోడ్డుకు కూడా నిధులు విడుదల అయ్యేలా కృషి చేస్తానన్నారు. ప్రత్యేకంగా రెండవ ఓవర్ హడ్ ట్యాంక్ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. గుడివాడ పట్టణంలో రోడ్లు, సిసి డ్రైనేజీల అభివద్ధికి పూర్తిస్థాయిలో అంచనాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఫ్లైఓవర్ బిడ్జి పనులు త్వరగతిన పూర్తిచేయాలని, కొన్ని ప్రాంతాలలో అండర్ పాస్‌ను అడగడం జరిగిందన్నారు. అలాగే ఫ్లైఓవర్ బిడ్జి నుండి ప్రధాన రహదారిని కూడ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.2కోట్లతో ప్రత్యేకంగా సోలార్ ప్లాంట్, సిటి స్కాన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. త్వరలో పురపాలక సంఘానికి విడుదల అయ్యే 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. యువత చెడువ్యసనాలకు గురిచేస్తున్న గంజాయినీ పూర్తి స్థాయిలో అరికట్టాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు పాల్గొన్నారు.

మచిలీపట్నం ఎంపిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి గుడివాడ వచ్చిన ఎంపీ వల్లభనేని బాలసౌరికి ప్రజా వేదిక టిడిపి కార్యాలయంలో శనివారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన, బిజెపి నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, గుడివాడ నియోజవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కాకరాల సురేష్ సత్కరించారు. అనంతరం పామర్రు రోడ్డులో జరుగుతున్న రైల్వే గేట్లపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికార యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల పురోగతిని నేషనల్ హైవే డి.ఈ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల ఆలస్యం కారణంగా వాహనదారులకు ట్రాఫిక్‌తో, ప్రజలు విద్యుత్, త్రాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించేలా పనిచేయాలన్నారు. మార్చి నేలాఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు.

హౌసింగ్ ఈఈ పర్యటన

ప్రజాశక్తి-మోపిదేవి

మోపిదేవి నుంచి రావువారిపాలెం మార్గంలో హౌసింగ్ లేఔట్ త్రీలో ఆ శాఖ ఉన్నతాధికారి ఈఈ ఎస్.వెంకట్రావు పర్యటించారు. శనివారం సాయంత్రం ఎస్టీ గ్రహాలు ఆయన సందర్శించగా డిఈ బానోజి మోపిదేవి మండల అధికారి ధర్మేశ్వరరావు తదితరులు వెంట ఉన్నారు. ప్రధానంగా ఎస్టీలకు ఇంట్లోంచి బయటికి రావడానికి దారి లేదు అనే సమస్యపై వినతులు వెలువెత్తుతుండగా శనివారం అధికారులు పరిశీలించిన తదుపరి ఎస్టీల దారి సమస్యకు పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు ఈఈ ఇచ్చే నివేదికపై ఆధారపడి ఉంటుంది ఈ పర్యటన భాగంగా ఇంతకు ముందు మోపిదేవి మండలం లో పనిచేసిన రాజులపాటి తాండవకృష్ణను కూడా పిలిపించి వివరాలు సేకరించారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషం : సిపిఎం

ప్రజాశక్తి-చల్లపల్లి: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు అమానషమని సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ వామపక్ష నేతల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి మతపరమైన దాడులు కాదని సామ్రాజ్యవాదులు చేస్తున్న దాడులను వివరించారు. పాలస్తీనా ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాద్దనపూడి మధు, వి.వసంతరావు, పి.జనార్దన్, ఎస్.బాలయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అజీజ్, సిహెచ్ గంగాభవాని, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ:** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తూన్న నరమేధం ఆపాలని, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని శనివారం టిడ్కో కాలనీ ట్యాంక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టిడ్కో కాలనీ కార్యదర్శి బసవ అరుణ, ఆర్.శివరాం ప్రసాద్, సయ్యద్ నూరున్నిసా, ఎమ్.చినమ్ములు, వి.రంగారావు, షేక్ గౌస్, టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ఏ.ఆదినారాయణ, మంజూర్ పాల్గొన్నారు.

గుడివాడలో...

చల్లపల్లిలో...

కేరళ విపత్తు బాధితులకు సిపిఎం అండ

కేరళ రాష్ట్రం వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి విలయం సృష్టించిన ఘటనలో బాధిత కుటుంబాలకు సంఘీభావం, సహాయక చర్యలకు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. విపత్తుతో ప్రతి ఒక్కరూ అనేక విధాలుగా నష్టపోయారని, వారిని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు: కేరళ విపత్తు బాధితులకు సహాయార్థం ఉయ్యూరు సెంటర్లో శనివారం సిపిఎం నాయకులు విరాళాలను సేకరించారు. కాటూరు రోడ్, బందర్ రోడ్డు, విజయవాడ రోడ్డులో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం రూ.8 వేలు నిధి సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.రాజేష్, నాయకులు అన్నే సుబ్బారావు, లక్ష్మణరావు, కెసిపి లక్ష్మణరావు, బి.కీర్తి, ఎన్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం:** బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో రూ.15,200 విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనాల సురేష్, మండల కార్యదర్శి చింతా వెంకట వీరరాఘయ్య, ముఠా నాయకులు పెద్దిరాజు, నాగరాజు, సిపిఎం నాయకులు బేతా శ్రీనివాసరావు నల్లి రవి, తోట సాంబశివరావు పాల్గొన్నారు. **కంకిపాడు :** పోరంకి సెంటర్ నుండి తాడిగడప సెంటర్ వరకు నిర్వహించిన విరాళాల సేకరణలో మొత్తం రూ.4,595 సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పెనమలూరు మండలం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, ఖాశీం, ఎస్కె బాబు, మరీదు భాస్కరరావు, పుసులూరి సత్యనారాయణ, సిహెచ్.భవానీ, వీసం రమణమ్మ పాల్గొన్నారు.

ఉయ్యూరులో...

గన్నవరంలో...

పెనమలూరులో...

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-పెడన: పారిశుధ్యం, తాగునీరు పలు అంశాలపై పూర్తిస్థాయిలో ప్రజలకు అందించడంలో జిల్లాలో వెనుకబడ్డారని పెడన మండల అధికారులకు ఇటీవల ఉన్నతాధికాలు ఇటీవల మెమోలు జారీ చేశారు. అయినప్పటికీ కిందిస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న నడుపూరు గ్రామ సచివాలయమే ఇందుకు నిదర్శనం. శనివారం ఉదయం 10:30 గంటల సమయం దాటినా సచివాలయ కార్యాలయం తలుపులు తెరుచుకోలేదు. ఈ సచివాలయంలో 11 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం పది గంటలకు కార్యాలయం తలుపులు ప్రతిరోజు 11:30 గంటలకు తీస్తున్నారని, 11 మంది సిబ్బందిలో ఒకరిద్దరు మినహా మిగిలిన అధికారులు విధులకు గైర్హాజరు అవుతున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని వివిధ సమస్యలతో నిత్యం కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లిపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని, సమస్యలు పరిష్కరించాలని ప్రజలుకోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రెడ్డియ్యను వివరణ కోరగా విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-పమిడిముక్కల: వీరంకిలాకు అగ్నిప్రమాద బాధితులకు శనివారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆర్థిక సాయం అందజేశారు. అన్నపురెడ్డి అప్పన్నకు రూ.17 వేలు, రాజ్యలక్ష్మికి రూ.3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల సుబ్రహ్మణ్యం, పరస సిల్లీబాబు, రాజులపాటి శ్రీనివాసరావు, లింగమనేని రామారావు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఎస్పిని కలిసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) కృష్ణాజిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.గంగాధరరావు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి. గీతాబాయి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పంట కాలువ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి: నియోజకవర్గంలో రైతులకు సక్రమంగా సాగునీరు అందించడమే ధ్యేయంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు, పాగోలు ఎంపీటీసీ సభ్యులు మేకా బంగారు బాబు అన్నారు. శనివారం చల్లపల్లి మండలం పాగోలు వద్ద ఏడో నెంబరు పంటకాలువ అభివద్ధి పనులను ప్రభుత్వ నిధులతో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. చల్లపల్లి మండల పరిధిలోని రాముడుపాలెం నాదెళ్లవారిపాలెం, పురిటిగడ్డ, పాగోలు, మేకావారిపాలెం గ్రామాల పరిధిలో ఉన్న దాదాపు 1,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ పంట కాలువ అభివృద్ధికి అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించడంతో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇరిగేషన్ శాఖ డీఈఈ రావెళ్ళ రవికిరణ్, ఏఈఈ కూరపాటి శ్రీరామ్ జనార్ధన్ పర్యవేక్షణలో పనులు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను ఎంపీటీసీ మేకా బంగారుబాబు, సీనియర్ నాయకులు వేమూరి గోవర్ధనరావు, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, రైతులు పరిశీలించారు.

స్పోర్ట్స్ టూరిజంలో విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్పోర్ట్స్ టూరిజంలో వందమంది విద్యార్థులకు ఆస్ట్రేలియాలో శిక్షణకు అవకాశం కల్పించినట్లు హోప్ ఆన్ కంగారు సంస్థ ఫౌండర్ హరీష్ బీసం తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో వస్తున్న విపరీతమైన మార్పుల నేపథ్యంలో విద్యార్థులకు మానసికంగా శారీరకంగా దఢంగా ఉండేందుకు ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రియల్ మాడ్రిడ్ స్పోర్ట్స్ క్లబ్, కార్లోస్ ఆల్కరాజ్ క్లబ్, క్రికెట్ విక్టోరియా, మల్బోర్న్ యూనివర్సిటీల సహకారంతో ఆస్ట్రేలియాలో భారతదేశానికి చెందిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. మానసికంగా శారీరకంగా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఆస్ట్రేలియాకు చెందిన హోప్ ఆన్ కంగారు సంస్థ ఫౌండర్ హరీష్ బీసం ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో ముందుకు వచ్చారన్నారు. దీనివల్ల పిల్లల్లో ఒక మంచి పాజిటివ్ ఆలోచన వస్తుందని, స్పోర్ట్స్ టూరిజం, మెల్బోర్న్ యూనివర్సిటీలో ప్రొఫెసర్లతో ఒక ట్రైనింగ్ క్లాస్, క్రికెట్ విక్టోరియాతో మరో ట్రైనింగ్ క్లాస్, భారతదేశ విద్యార్థులు ఆస్ట్రేలియా విద్యార్థుల మధ్య ఒక గెట్ టుగెదర్ నిర్వహించడం జరుగుతుందని హరీష్ బీసం చెప్పారు. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. రియల్ మాడ్రిడ్ క్లబ్, కార్లోస్ ఆల్కరాజ్, క్రికెట్ విక్టోరియా, మెల్బోర్న్ యూనివర్సిటీ నుండి విద్యార్థులకు సర్టిఫికెట్స్ మంచి గుర్తింపు, జ్ఞాపకంగా ఉంటుందని హరీష్ తెలిపారు.15 రోజులపాటు నిర్వహించే ఈ టూర్ లో విద్యార్థులకు ప్రయాణం టికెట్లు, వసతి, భోజనం అన్ని తామే అతి తక్కువ ఖర్చులో ఏర్పాటు చేస్తామని హరీష్ చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈమెయిల్ (registrations@hokangaroo.com.au) తమ పేర్లను నమోదు చేయించుకోవాలని చెప్పారు.

నగరంలో యావరేజ్ స్టూడెంట్ నాని చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ :
నగరంలో యావరేజ్ స్టూడెంట్ నాని చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా బందరు రోడ్డులోని ఒక హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర హీరో పవన్ కొత్తూరి మాట్లాడుతూ యావరేజ్ స్టూడెంట్ నాని చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రొమాన్స్, కామెడీ,యాక్షన్ అన్ని అంశాలు చిత్రంలో ఉండడంతో యువత ఈ చిత్రాన్ని వీక్షించేందుకు థియేటర్స్‌కు తరలి రావడం ఆనందంగా ఉందన్నారు. చిత్ర విజయవత్సవ యాత్ర విజయవాడ నగరం నుంచి ప్రారంభించామని గుంటూరు, విశాఖపట్నం మీదుగా తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతుందని వివరించారు. తాను ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరించడంతోపాటు హీరోగాను నటించినట్లు పేర్కొన్నారు. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, ఝాన్సీ నటించిన పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. హీరోయిన్స్ కు తెలుగు భాష రాకపోయినప్పటికీ కూడా వారి పాత్రలకు తగిన న్యాయం చేశారని చెప్పారు. తాను దర్శకుడుగా తీసిన రెండో చిత్రం యావరేజ్ స్టూడెంట్ నాని విజయవంతం కావడంతో మరో చిత్రానికి దర్శకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనకు అవకాశం వస్తే మెగాస్టార్ చిరంజీవి సినిమాకు దర్శకత్వం వహించాలని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు. అనంతరం హీరోయిన్స్ స్నేహ, సాహిబా భాసిన్ మాట్లాడుతూ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటించే అవకాశం కల్పించిన దర్శకుడు పవన్ కొత్తూరి కి వారు కతజ్ఞతలు చెప్పారు. విడుదలైన అన్ని కేంద్రాలలో తమ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు.

సమస్యలు ఆకళింపు దిశగా అడుగులు

వీక్షణం

విజయవాడ నగరంలో నెలకొన్న సమస్యలు ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత నెల 25న నగర పాలక సంస్థ 26వ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన హెచ్.ఎం.ధ్యానచంద్ర వీటిని ఏవిధంగా పరిష్కరిస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే వడివడిగా సమస్యలను పరిశీలించడం, వాటి అధ్యయనం చేయడం దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ విఎంసి కమిషనర్‌గా వచ్చిన ఆయన 2019-20 కోవిడ్ సమయంలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. అప్పటి నుంచి నగరంపై కమిషనర్‌కు కొంత అవగాహన ఉన్నప్పటికీ... పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవడానికి తనదైన శైలిలో పలు రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పది రోజుల కాలంలో సమస్యలపై అవగాహన పెంచుకునే పనిలో బిజీ..బిజీగా ఉన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకోవడంపై అవగాహన పెంచుకునేందుకు నగరంలో పర్యటనలు చేస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన తొలి రోజున మీడియాతో మాట్లాడినవిధంగా తన తొలి ప్రాధాన్యతతోపాటు మిగిలిన అనేక అంశాలపై కూడా అవగాహన పెంచుకోవాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. మంచినీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుదల, నగర సుందరీకరణ, ప్రధాన కాల్వల సుందరీకరణ, కాల్వగట్ల బ్యూటిఫికేషన్ పనులపై దృష్టి సారించారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాల అధికారులను ప్రతి రోజు ఉదయం తన నగర పర్యటనలో వెంటపెట్టుకొని తిరుగుతూ సమస్యలను పరిశీలన, వాటి పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. అయితే నిధుల లభ్యత ఎలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నారు. అయితే ఇదే క్రమంలో విఎంసి కమిషనర్‌ను ఆయా రాజకీయపక్షాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు కలిసి నగర ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి కమిషనర్ తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టర్ల బిల్లులు తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనేక సంఘాలు, అసోసియేషన్లు, రాజకీయపక్షాల నేతలు, ఉద్యోగులు, కార్మికులు కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నగరంలో నెలకొన్న సమస్యలతోపాటు ఆయా సంఘాలు, రాజకీయ పక్షాల నేతలు, కార్పొరేటర్లు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఆకలింపు చేసుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర వాటిని ఏవిధంగా పరిష్కరిస్తారో వేచిచూడాలి.

- వి.హెచ్.రాజు

సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :
దేశీ కళా అతెన్టిక్ లూమ్‌లి ఆధ్వర్యంలో సిల్క్ ఇండియా ఎక్స్‌పో 2024, వస్త్ర ప్రదర్శన ఎంజీ రోడ్ లోని శ్రీ శేష సాయి కళ్యాణ వేదికలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ గద్దె అనురాధ లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 2 నుంచి 7 వరకు ఈ ఎక్స్‌పో కొనసాగుతుంది అని తెలిపారు. “ఈ సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ లాంచ్‌లో పాల్గొనడం గౌరవంగా, ఆనందంగా ఉందన్నారు. మన దేశానికి వస్త్ర ఉత్పత్తిలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర ఉంది అన్నారు., మన సాంస్కృతిక ఫాబ్రిక్‌లో చేనేత ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. మన కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం, అంకితభావాన్ని చెబుతుందన్నారు. సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ నిర్వహించే ప్రాంతం అంతటా 50ం మాస్టర్ వీవర్ల నుండి చేతితో నేసిన వస్త్రాలు, సాంప్రదాయ చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేయబడిందన్నారు. చీరలు, స్కార్ఫ్‌లు, బట్టలు, గృహ వస్త్రాలు, మరిన్నింటితో సహా అనేక రకాల చేనేత ఉత్పత్తులను సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి నైపుణ్యం కలిగిన నేత కార్మికులు రూపొందించారన్నారు. ఆగస్టు 7 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ఆర్గనైజర్ సతీష్ కుమార్ తెలిపారు.

మానవతా దృక్పథంతో వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్

ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద విరాళాల సేకరణ కార్యక్రమ దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ : ఇటీవల సంభవించిన తుఫాను బీభత్సంలో ఎంతో సుందరప్రదేశమైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలోని పలు గ్రామాలపై కొండ చర్యలు విరిగిపడి 300 మందికి పైగా మృతి చెందడమే గాక, వందల మంది గల్లంతయ్యి, వేలాది గృహాలు నేలమట్టం అయ్యి, ఊళ్లకు ఊళ్లే రూపురేఖలు కోల్పోయి, సర్వం కోల్పోయిన ఆ ప్రాంత ప్రజలను మానవతా హృదయంతో ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సహాయమందించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పిలుపునిచ్చారు. వాయినాడ్ వరద బాధితుల సహాయ నిధి వసూళ్ల కార్యక్రమం సిపిఎం ఆధ్వర్యంలో నగరంలోని బీసెంట్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో జరిగింది. ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా అన్సారీపార్కు సెంటర్‌లో జరిగిన కార్యక్రమానుద్దేశించి కాశీనాద్ మాట్లాడుతూ... ప్రకృతి విలయతాండం కారణంగా కేరళలోని వాయినాడ్ ప్రాంతాన్ని తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని అన్నారు. ఎంతో సుందరమైన టూరిస్టు ప్రదేశంగా...మరో కొడైకెనాల్, ఊటీ మాదిరిగా ఉండే వాయినాడ్ తుఫాను తాకిడితో నేడు పూర్తిగా కకావికలం అయ్యి, సుందరప్రదేశం మొత్తం మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాట, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, సాయం చేసినట్లుగానే మన రాష్ట్ర ప్రభుత్వం కూడా వారిని ఆదుకునేందుకు ముందుకు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రవీణ్, నాయకులు సి.కృష్ణమూర్తి, బాలబొమ్మ లక్ష్మణ, వై.సుబ్బారావు, ఎం.బాబూరావు, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం సీతారాములు, హాకర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భూలోకం, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ : కేరళలోని వయనాడ్ ప్రాంతంలో జరిగిన ప్రకృతి వైపరీత్యం కారణంగా వరదల్లో కొట్టుకుపోయిన బాధిత కుటుంబాల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరణ కార్యక్రమం పటమట ఎన్.టి.ఆర్ సర్కిల్ వద్ద నుండి ప్రారంభించి చెక్ పోస్ట్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ కేరళలో జరిగిన మహా విపత్తు యావత్తు దేశాన్ని బాధించింది. ఇప్పటికే 316మంది వరకు ప్రాణాలు కోల్పోయారని ఇంకా ఆచూకీ తెలియని వారు 200 వరకు ఉన్నారని ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలియచేసింది. అక్కడి యువత, మహిళలు, కార్మికులు, విద్యార్థులు సహాయ కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. కేరళకు ఇవ్వాల్సిన నిధులను ఎలాగో కేంద్రం ఇవ్వడం లేదని, కనీసం ఇటువంటి సందర్భంలో అయినా నిధులు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.కృష్ణ, నాయకులు గురుమూర్తి, చంద్రశేఖర్, కొరడ రమణ, మురహరి తదితరులు పాల్గొన్నారు.

చిన్ని దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు

దుర్గమ్మను దర్శించుకున్న ఎం.పి శివనాథ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతుల వారు శనివారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ కార్యనిర్వాహనాధికారి కె.ఎస్. రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ అమ్మవారి ప్రసాదం. శేషవస్త్రములు, చిత్రపటం అందజేశారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహనా కార్యక్రమం శనివారం ఈడుపుగల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా మాట్లాడుతూ అవయవదాన ప్రాముఖ్యత, ఏ సందర్భాల్లో మనం అవయవదానం చేయాలన్నారు. దీనిపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ యం.శ్రీనివాస రావు మాట్లాడుతూ అవయవదానం అనేది ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, అన్నారు. బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జిల్లా పరిషత్ స్కూల్‌క కుర్చీలు, బీరువాను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా, ఎజిఎం యం.శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, జడ్‌పి హెచ్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - తిరువూరు : పాఠశాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని తిరువూరు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిణి, మల్లేల గ్రామ పంచాయితీ సంక్షేమ, అభివృద్ధి, పారిశుధ్య పనుల ప్రత్యేక అధికారి టి.గాయత్రి సూచించారు. శనివారం మండలంలోని మల్లేల ప్రాథమిక పాఠశాల (మెయిన్)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలన చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల అమలు గురించి ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ ఎం జొన్నల గడ్డ సీతామ హాలక్ష్మి, ఎం.ఎస్. కె.విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సాయం

ప్రజాశక్తి - తిరువూరు : బీటెక్, ఎంబిబిఎస్ చదువుతున్న ఇద్దరు నిరుపేద విద్యార్థులకు రూ.50 వేలు చొప్పున ఎమ్మెల్యే కొలిక పూడి శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందజేశారు. తిరువూరులోని తన నివాసం వద్ద తల్లిదండ్రుల పేదరికంతో పిల్లల చదువుకు దూరం కాకూడదని ఎమ్మె ల్యే వారి తల్లిదండ్రులకు శనివారం ఆర్థిక చేయూత అంద జేశారు.